SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 292 ఎడిటర్ : విక్రం కుమార్ సోమవారం 30, జూన్ 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

## ఉత్తరాదిని
# ముంచెత్తిన వానలు

**ఉత్తరాఖండ్‌లో ఇద్దరి మృతి**

- 24 గంటల పాటు చార్‌ధామ్ యాత్ర నిలిపివేత
- ఝార్ఖండ్‌లో 162 మంది విద్యార్థులు సురక్షితం



**జూన్ 29, సమయం న్యూస్, రాంచీ:** వాయవ్య, మధ్య, ఈశాన్య రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఉత్తరాఖండ్‌లోని ఉత్తర్‌కాశీ జిల్లాలో కుంభవృష్టి కారణంగా యమునోత్రి జాతీయ రహదారిలోని సిలాయ్ బైండ్‌లో ఆదివారం కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో నిర్మాణంలో ఉన్న ఓ హోటల్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఏడుగురి ఆచూకీ గల్లంతైంది. ఘటనాస్థలానికి 18 కిలోమీటర్లల దూరంలోని తిలాడీ షాహిద్ స్మారక్ వద్ద

తరువాయి 2లో



## ఎమర్జెన్సీ పోరాట యోధుల్ని సదా స్మరించుకోవాలి

- 123వ 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ
- దేశంలో 95 కోట్ల మందికి సామాజిక రక్షణ

**జూన్ 29, సమయం న్యూస్, ఢిల్లీ:** దేశంలో ఎమర్జెన్సీ విధించినవారు రాజ్యాంగాన్ని హత్య చేసి, న్యాయవిభాగాన్ని కీలుబొమ్మగా మార్చుకోవాలని అనుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. నాటి నిర్బంధంపై పోరాడిన యోధులను కచ్చితంగా స్మరించుకోవాలని, అది రాజ్యాంగాన్ని కాపాడుకోడానికి మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తవడాన్ని ఆదివారం నాటి 123వ 'మన్‌కీ

తరువాయి 2లో

## నేడు విజయవాడలో
# క్వాంటమ్ వ్యాలీపై వర్క్‌షాప్



- పాల్గొనేందుకు వచ్చిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులు
- ప్రముఖులకు సీఎం చంద్రబాబు విందు

**జూన్ 29, సమయం న్యూస్, అమరావతి:** అమరావతి క్వాంటమ్ వ్యాలీపై సోమవారం విజయవాడలోని ఓ హోటల్‌లో రాష్ట్ర ప్రభుత్వం వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఇందులో పాల్గొనేందుకు ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు పలువురు విజయవాడకు చేరుకున్నారు. సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో ఆది వారం రాత్రి వారికి విందు ఇచ్చారు. ఆయా కంపెనీల ప్రతినిధులతో క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేయడంపై చర్చించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సహకారంతో దేశంలోనే మొదటి పార్కును ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని వివరించారు. టీసీఎస్ ప్రెసిడెంట్, గ్లోబల్ హెడ్ (టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్) వి.రాజన్న,

తరువాయి 2లో

## రామచందర్‌రావు, ఈటలలో
# ఒకరికి అవకాశం!

- భాజపా అధ్యక్షుడు ఎవరో తేలేది నేడే

**జూన్ 29, సమయం న్యూస్, హైదరాబాద్:** భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవికి తుది రేసులో ఇద్దరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌లలో ఒకరికి అవకాశం దక్కే వీలుందని విశ్వసనీయ సమాచారం. కాబోయే నూతన అధ్యక్షుడికి సోమవారం ఉదయం జాతీయ నాయకత్వం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందనున్నట్లు తెలిసింది. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం నియమితులైన ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. జాతీయ ప్రధాన

తరువాయి 2లో







## మావోయిస్టుల అడ్డాగా
# రాష్ట్రాన్ని మార్చొద్దు

- రేవంత్‌నుద్దేశించి అమిత్‌షా వ్యాఖ్య
- కొందరు కాంగ్రెస్ వాళ్లు శాంతిచర్చలు అంటున్నారు
- మావోయిస్టుల చేతిలో ప్రాణాలొదిలిన ఆదివాసీ కుటుంబాలకు ఏం చెబుతారు?
- 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని తుదముట్టిస్తాం
- భారాస హయాంలో భారీ అవినీతి... అయినా కేసులేవి
- నిజామాబాద్‌లో కేంద్ర హోంమంత్రి
- జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం

2లో

## ఒప్పందం
# కుదుర్చుకోండి

- ఇజ్రాయెల్-హమాస్‌లకు స్పష్టంచేసిన ట్రంప్

టెల్ అవీవ్: గాజాలో జరుగుతున్న యుద్ధాన్ని వేగంగా ముగించి, సంధి కుదుర్చుకోవాలని ఇజ్రాయెల్‌హమాస్‌లకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. ఈ మేరకు ఆయన తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఆదివారం ఉదయం పోస్టు పెట్టారు. ''ఒప్పందం చేసుకోండి. బందీలను వెనక్కి తీసుకురండి'' అని అందులో పేర్కొన్నారు. వచ్చే వారంలోపు రెండు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందని శనివారం కూడా ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అవినీతి కేసులు ఎదుర్కొంటున్న

తరువాయి 2లో




# ఎమ్మెల్యేలూ.. తీరు మార్చుకోండి

- ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తు
- నా సూచనలు పాటిస్తే మళ్లీ ఎన్నికవుతారు.. లేదంటే ఇంటికే
- కొత్తగా ఎన్నికైన వాళ్లు.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- జనసేన, భాజపా శ్రేణులతో సమన్వయం చేసుకోండి
- తెదేపా విస్తృతస్థాయి సమావేశంలో సీఎం చంద్రబాబు ఘాటు హెచ్చరికలు
- సమావేశానికి 56 మంది గైర్హాజరుపై తీవ్ర అసంతృప్తి



2లో

## ఆ నాలుగు గ్రామాలను
# తెలంగాణలో కలపండి

- అగ్రి వర్సిటీలో పసుపు పరిశోధన కేంద్రం నెలకొల్పాలి
- అమిత్‌షాకు మంత్రి తుమ్మల వినతి

**జూన్ 29, సమయం న్యూస్, హైదరాబాద్:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలం చుట్టూ ఉన్న ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. పసుపు రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని, అధిక కర్క్యుమిన్ శాతం, ఎగుమతులకు అనుకూలమైన విత్తన రకాల అభివృద్ధి కోసం జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక పసుపు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆదివారం నిజామాబాద్‌లోని బస్వా గార్డెన్‌లో పసుపు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో

తరువాయి 2లో



# ఎమర్జెన్సీ పోరాట యోధుల్ని సదా స్మరించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

బాత్'లో ప్రధాని ప్రస్తావించారు. ఎమర్జెన్సీపై గళమెత్తిన మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్‌రామ్‌ల ఆడియో ప్రసంగాలను కాసేపు వినిపించారు. భారత జనాభాలో దాదాపు 95 కోట్లమంది (64 శాతం) ఏదో ఒక సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని మోదీ చెప్పారు. 2015 నాటికి సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25 కోట్లమందికి అందేవని గుర్తు చేశారు. ఇటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యావత్ ప్రపంచం జరుపుకొందని, అందరి జీవితాల్లో యోగా భాగమవుతోందని హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న శుభాంశు శుక్లాకు అభినందనలు తెలిపిన ప్రధాని.. భారతదేశం కొత్త చరిత్రను లిఖించిందన్నారు.

**యోగా దినోత్సవం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది**

ఈ ఏడాది అద్భుతంగా జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం.. యోగాను తమ జీవితంలో అంతర్భాగంగా మార్చుకొనేలా మరింత మందికి కచ్చితంగా స్ఫూర్తినిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా చేసిన ప్రసంగంలో విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరోసారి గుర్తుచేసుకున్నారు. "ఈ సారి కూడా జూన్ 21న దేశంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాలుపంచుకున్నారు. విశాఖపట్నంలో సముద్రం ఒడ్డున 3 లక్షల మంది ప్రజలు ఒకేసారి యోగా చేశారు. విశాఖపట్నం నుంచే మరో అద్భుతమైన దృశ్యం మనముందు కనిపించింది. తెలంగాణలో 3వేల మంది దివ్యాంగులు ఒకేచోట యోగాలో భాగస్వాములు అయ్యారు. సశక్తీకరణకు యోగా ఎలా మాధ్యమంగా మారిందన్న విషయాన్ని వారు ఆచరణలో చూపించారు. యోగాను తమ జీవితంలో అంతర్భాగంగా మార్చుకొనేలా మరింతమందికి కచ్చితంగా స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ఉత్తరాదిని ముంచెత్తిన వానలు

(మొదటిపేజీ తరువాయి)

ఆ ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. ప్రమాద స్థలంలో మొత్తం 29 మంది ఉన్నారని, వీరిలో 20 మందిని రక్షించామని అధికారులు తెలిపారు.

**చార్‌ధామ్‌యాత్ర 24 గంటల నిలిపివేత**

వరదల కారణంగా చార్‌ధామ్ యాత్రను 24 గంటలపాటు అధికారులు నిలిపివేశారు. హరిద్వార్, రిషికేశ్, శ్రీనగర్, రుద్రప్రయాగ్, సోన్‌ప్రయాగ్, దేహ్రాదూన్, నైనీతాల్, తెహ్రీల్లో ఉన్న యాత్రికులను ముందుకువెళ్లకుండా ఆపాలని స్థానిక యంత్రాంగానికి సమాచారమందించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు గఢ్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. సోమవారం వాతావరణ పరిస్థితులను సమీక్షించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

**పరీక్ష కోసం తెగించిన యువకులు**

రుద్రప్రయాగ్‌లోని బంగర్‌పట్టిలో 12 గ్రామాలను కలిపే మయాలీ రాందార్ రోడ్డుపై ఉన్న వంతెన తెగిపోవడం వల్ల అక్కడి జనజీవనం స్తంభించిపోయింది. ఈ క్రమంలో ప్రాంతీయ సివిల్ సర్వీస్(పీసీఎస్) పరీక్ష రాయడానికి అక్కడి యువకులు వారి ప్రాణాలకు తెగించి ఉధృతంగా ప్రవహిస్తున్న నదిని దాటి పెద్ద సాహసమే చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలయ్యింది. వికాస్‌ఖండ్ జకోలిలోని కుణాఘడ్ గదేరా వాగు పొంగిపొర్లడంతో పోంతి, మునియాఘర్‌ల మధ్య నిర్మించిన వంతెన తెగిపోయింది. దీంతో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**వరదలో చిక్కుకున్న 162 మంది విద్యార్థులు సురక్షితం**

ఝార్ఖండ్‌లోని తూర్పు సింగ్భూమ్ జిల్లాలో భారీ వర్షం కారణంగా వరద నీటిలో మునిగిన ఓ ఆశ్రమ పాఠశాల భవనంలో చిక్కుకున్న 162 మంది విద్యార్థులను స్థానికుల సాయంతో రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 1 నుంచి 28 వరకు రాష్ట్రంలో 80 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. పలు చోట్ల కొండచరియలు విరిగిపడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**రాబోయే వారం రోజులు భారీవర్షా లు: ఐఎండీ**

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రాబోయే వారం రోజులు పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) హెచ్చరించింది. ఈ మేరకు ఐఎండీ ఆదివారం రెడ్ అలర్ట్ జారీచేసింది. చండీగఢ్‌లో ఒక్కరోజే 119.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది.

# నేడు విజయవాడలో క్వాంటమ్ వ్యాలీపై వర్క్‌షాప్

(మొదటిపేజీ తరువాయి)

మైక్రోసాఫ్ట్ ఇండియా ఎండీ రాజీవ్‌కుమార్, ఏటీ అండ్ టీ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ సిద్ధు, వార్నర్ బ్రదర్స్ ఇండియా ఇన్నోవేషన్ సెంటర్ హెడ్ మనీష్‌వర్మ, భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర కె.ఎల్ల, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, నేషనల్ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ జె.బి.వి.రెడ్డి, ఆస్ట్రాజెనెకా ఎండీ ప్రవీణ్‌రావు, ఐబీఎం ఇండియా వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్, కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అభయ్ కరాండికర్, కేంద్ర ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు అజయ్‌కుమార్ సూద్ తదితర ప్రముఖులు ఈ విందుకు హాజరయ్యారు. వీరితో పాటు అమెజాన్, హెచ్‌సీఎల్, ఎల్‌అండ్‌టీ, ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, బ్యాంక్ ఆఫ్ అమెరికా సంస్థల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒప్పందం కుదుర్చుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును సమర్థిస్తూ మరోసారి ట్రంప్ పోస్టు పెట్టారు. నెతన్యాహుపై ప్రస్తుతం కొనసాగుతున్న రాజకీయ వేధింపులు గతంలో తనపైనా జరిగాయని అన్నారు. "హమాస్‌తో ఒప్పందం కుదుర్చుకునే ప్రక్రియలో ఆయన(నెతన్యాహు) ఉన్నారు. బందీలను వెనక్కి తీసుకురావాలని చూస్తున్నారు. రోజంతా కోర్టులోనే ఉంటే అదెలా సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. నెతన్యాహుపై కేసులను రద్దు చేయాలని గత వారం కూడా ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఉత్తర గాజాను ఖాళీ చేసి దక్షిణ గాజాలోని మువాసీ ప్రాంతానికి తరలివెళ్లాలని పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించింది.

**హమాస్ సహ వ్యవస్థాపకుడు అల్-ఇస్సా హతం**

గాజాపై శుక్రవారం చేసిన దాడుల్లో హమాస్ సహ వ్యవస్థాపకుడు, సైనిక విభాగ కీలక నేత అయిన మహమ్మద్ ఇస్సా అల్‌ఇస్సాను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ప్రకటించింది. గాజాలోని సబ్రా ప్రాంతంలో జరిగిన వైమానిక దాడిలో అతడు మరణించినట్లు తెలిపింది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడికి అతడే ప్రణాళిక రచించి, అమలు చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది.

# మావోయిస్టుల అడ్డాగా రాష్ట్రాన్ని మార్చొద్దు

**నిజామాబాద్:** ఇందూరు (నిజామాబాద్)లో పండించిన పసుపును విదేశాలకు ఎగుమతి చేసి విశ్వవ్యాప్తం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు ద్వారా రైతుల నాలుగు దశాబ్దాల కలను ప్రధాని మోదీ సాకారం చేశారన్నారు. మావోయిస్టులు ఆయుధాలు విడిచి జనజీవన స్రవంతిలో కలవాలంటూ హితవు పలికారు. 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని తుదముట్టిస్తామని పునరుద్ఘాటించారు. రాష్ట్రాన్ని మావోయిస్టులకు అడ్డాగా మార్చొద్దని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నిజామాబాద్‌లో ఆదివారం జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్‌షా ప్రారంభించారు. అనంతరం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కిసాన్ మహా సమ్మేళన్ సభలో ఆయన ప్రసంగించారు. "ఆయుధాలు చేతపట్టుకున్న వారితో చర్చలు జరపలేం. ఇది మా ప్రభుత్వ విధానం కాదు. వారు అడవుల్లో 40 వేల మంది ఆదివాసీలను హతమార్చారు. పోలీసులనూ చంపారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఆయుధాల్ని విడిచి లొంగిపోవాలి. ఏడాదిన్నరలో 2 వేల మందికిపైగా జనజీవన స్రవంతిలో కలిశారు. మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కొందరు కాంగ్రెస్ నేతలు అంటున్నారు. మరి మావోయిస్టుల చేతిలో ప్రాణాలొదిలిన ఆదివాసీల కుటుంబాలకు మీరేం సమాధానం చెబుతారు? మావోయిస్టుల కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి గురించి ఏం వివరణ ఇస్తారు?

**అవినీతి యథాతథం**

భారాస సర్కారు హయాంలో భారీ అవినీతి జరిగింది. ధరణి పోర్టల్, కాళేశ్వరం ప్రాజెక్టు, సింగరేణి, టీఎస్‌పీఎస్సీ తదితరాల్లో అవినీతి జరిగింది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. గతంలో కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి తెలంగాణ ఏటీఎంగా మారింది. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో దిల్లీకి ఏటీఎంగా తయారైంది. భారాస పోయి కాంగ్రెస్ వచ్చినా అవినీతి మాత్రం పోలేదు. తెలంగాణ యువత, దళితులు, మహిళలు, బడుగు బలహీనవర్గాలవారు డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని కోరుకుంటున్నారు. రానున్న కాలంలో తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తుంది. 2024లో మోదీ ఇచ్చిన హామీ మేరకు నిజామాబాద్ గడ్డపై జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేశాం. పసుపు ప్యాకేజింగ్, మార్కెటింగ్, ఎగుమతులకు ప్రత్యేక వ్యవస్థలు నెలకొల్పుతాం. నిజామాబాద్‌లో భారత్ ఎక్స్‌పోర్ట్సు, భారత్ ఆర్గానిక్ లిమిటెడ్ శాఖలను ఏర్పాటు చేయనున్నాం. రైతులను అమెరికా, స్విట్జర్లాండ్, యూకే, ఆస్ట్రేలియా తదితర దేశాలకు పంపిస్తాం. వారు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే మా లక్ష్యం.



పసుపు బోర్డు లోగోను ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా. చిత్రంలో సీతక్క, కిషన్‌రెడ్డి, అర్వింద్, తుమ్మల నాగేశ్వరరావు

**మోదీ పాలనలో దేశానికి రక్షణ**

గతంలో కాంగ్రెస్ పాలనలో పాకిస్థాన్ ఉగ్రవాదులు మన దేశంలో దాడులు చేసి పారిపోయేవారు. మోదీ హయాంలో ఆ పరిస్థితి లేదు. ఉరీలో సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామాలో ఎయిర్ స్ట్రైక్స్, పహల్గాం ఘటన అనంతరం ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాం. భారతీయులను ప్రశాంతంగా ఉండనీయబోమంటున్న పాకిస్థానీయుల ముఖాలు చూస్తే ఎవరికి ప్రశాంతత లేదో అర్థమవుతుంది. ఈ విషయాన్ని గ్రహించని రాహుల్ గాంధీ.. గత పదేళ్లుగా దేశాన్ని రక్షిస్తున్న మోదీని పదే పదే ప్రశ్నలు అడుగుతున్నారు" అని అమిత్‌షా అన్నారు.

- **నిజామాబాద్‌లో కిసాన్ మహా సమ్మేళన్ సభకు హాజరైన రైతులు**
- **యూరియా కష్టాలను కేంద్రం తీర్చింది: కిషన్‌రెడ్డి**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. గతంలో ఎరువుల కొరతతో రైతులు అల్లాడేవారని, ఈ నేపథ్యంలో యూరియా కష్టాలు తీర్చేందుకు కేంద్రం రూ.3,500 బస్తాను రాయితీపై రూ.260కే అందిస్తోందని తెలిపారు. అయినా, తెలంగాణకు మోదీ ఏం ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారని, కాంగ్రెస్‌కు సాధ్యం కాని పసుపు బోర్డును నిజామాబాద్ రైతులకు వరంగా మోదీ మంజూరు చేశారని ఆయన చెప్పారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు అర్వింద్‌గా మారారని చమత్కరించారు. తెలంగాణ ప్రజలు అందరికీ అవకాశం ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో భాజపాకు అవకాశం కల్పించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. అంతకుముందు అమిత్‌షా నిజామాబాద్ వినాయక్‌నగర్‌లోని జాతీయ పసుపు బోర్డు నూతన కార్యాలయాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, ఎంపీ అర్వింద్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం బస్వా గార్డెన్‌లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో మాజీ మంత్రి డి.శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీలు ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, లక్ష్మణ్, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలూ.. తీరు మార్చుకోండి...

అమరావతి: పార్టీ సమావేశం కంటే.. ఇతర కార్యక్రమాలే ఎమ్మెల్యేలకు ఎక్కువయ్యాయా అని తెదేపా అధినేత చంద్రబాబు ఆగ్రహించారు. విస్తృత సమావేశాలకే రానివారు.. ఇక తమ నియోజకవర్గాలకు ఏం చేస్తారని మండిపడ్డారు. తరచూ విదేశీ పర్యటనలు పెట్టుకునేవారు ఇక అక్కడే ఉండడం మంచిదని చురకలేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. దీనిపై ఆరాతీయగా.. కొందరు విదేశీ పర్యటనల్లో ఉన్నారని, మరికొందరు దైవదర్శనాలకు వెళ్లారనే సమాధానం వచ్చింది. మొత్తంగా ఆహ్వానితుల్లో 56 మంది రాకపోవడం, వారిలో 15మంది ఎమ్మెల్యేలు విదేశాల్లో ఉండడంపైనా చంద్రబాబు అసహనం వెలిబుచ్చారు. ముగింపు ప్రసంగం సందర్భంగా ఆయన ఎమ్మెల్యేలు, ఎంపీలకు పలు అంశాలపై ఒకింత ఘాటు హెచ్చరికలు చేశారు. నియోజకవర్గాలకు దూరంగా ఉండడం సరికాదని, ఎమ్మెల్యేలు తమ తీరు మార్చుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తు ఉంటుందని గట్టిగా చెప్పారు. సమావేశానికి ఉదయం ఎంతమంది వచ్చారు? సంతకాలు పెట్టి ఎంతమంది వెళ్లిపోయారు? సమావేశం చివరివరకు ఎంతమంది ఉన్నారనే వివరాలు తన దగ్గర ఉన్నాయని చెప్పారు. తానా, ఆటా సమావేశాలకు వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్న వారి వివరాలూ తమవద్ద ఉన్నాయని చంద్రబాబు చెప్పారు. ఇంటింటి ప్రచారం నేపథ్యంలో మంత్రులను సమీక్షల నుంచి మినహాయిస్తున్నామని, నెలరోజులూ నియోజకవర్గంలోనే ఉండాలని ఆదేశించారు.

- **ఎమ్మెల్యేలకు ఎందుకింత ఉదాసీనత?**

కొందరు ఎమ్మెల్యేల ఉదాసీన వైఖరిపై చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కొంతమంది ఎమ్మెల్యేలు పాపులర్ అవుతున్నారు.. మరికొందరు పేరు తెచ్చుకోలేకపోతున్నారు. అయినా సమర్థించుకుంటున్నారు. సీరియస్‌గా పనిచేయట్లేదు. ఇవన్నీ ప్రజలు గమనిస్తారని గుర్తుంచుకోండి. నేనిచ్చిన సూచనలతో పనితీరు మార్చుకుంటే ఎమ్మెల్యేగా మళ్లీ గెలుస్తారు. లేదంటే మీ ఇష్టం.. అర్థం చేసుకుంటారనే స్పష్టంగా చెబుతున్నా. ఇక మొహమాటం ఉండదు' అని స్పష్టం చేశారు. 'క్షేత్రస్థాయిలో జనసేన, భాజపా శ్రేణులను సమన్వయం చేసుకోవాలి. నేను, పవన్‌కల్యాణ్ ఇచ్చిన పిలుపుతో ఓటు బదిలీ బాగా జరిగింది. ప్రతి నాయకుడు మూడు పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి' అని సూచించారు.

- **హాజరైన మంత్రులు, తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు**

**అదీ లోకేశ్ పట్టుదల..**

'సరిగా పనిచేయలేని నాయకులకు పార్టీకి గట్టి పట్టున్న నియోజకవర్గం ఇస్తే దాన్నీ చెడగొడతారు. ప్రజల్లో రాణించగలిగే నాయకులకు ఎలాంటి నియోజకవర్గం ఇచ్చినా.. తమకు అనుకూలంగా మలచుకుని విజయం సాధిస్తారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. '2019 ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి పోటీచేయాలని లోకేశ్‌కు చెప్పా. అయితే తాను మంగళగిరిలోనే పోటీచేస్తానని చెప్పారు. ఎన్నికలకు నెల ముందు అక్కడికి వెళ్లి పోటీచేసి కొద్దితేడాతో ఓటమిపాలయ్యారు. తర్వాత ఐదేళ్లూ అక్కడే కష్టపడ్డారు. రాష్ట్రంలోనే మూడో అతిపెద్ద మెజారిటీ సాధించారు. అదీ ఆయన పట్టుదల.. మొదటిసారి గెలిచిన వాళ్లు ఇలాగే పనిచేయాలి' అని సూచించారు.

- **పక్కనుండే నలుగురినే ప్రోత్సహిస్తే.. నష్టమే**

కొంతమంది ఎమ్మెల్యేలు తమ చుట్టూ ఉండే నలుగురినే ప్రోత్సహిస్తున్నారని.. ఇది వారితోపాటు పార్టీకి కూడా నష్టం కలిగిస్తుందని చంద్రబాబు సూచించారు. 'వరసగా మూడుసార్లు మెజారిటీ తక్కువ వచ్చిన బూత్‌లలో ఎక్కువసార్లు ప్రచారం చేయాలి. ఇది మంచి ఫలితం ఇస్తుంది. పాపులారిటీ రేటింగ్ రిపోర్టు కూడా ఎమ్మెల్యేలకు ఇస్తాం' అని చంద్రబాబు చెప్పారు.

# ఆ నాలుగు గ్రామాలను తెలంగాణలో కలపండి

(మొదటిపేజీ తరువాయి)

అమిత్‌షాను తుమ్మల కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. "ఏపీ పునర్విభజన చట్టం 2014 కింద నాలుగు పంచాయతీలు, వాటి పరిధిలోని 17 రెవెన్యూ గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. దీనివల్ల పరిపాలనపరమైన సమస్యలే కాకుండా అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. భద్రాచలం పట్టణానికి, తెలంగాణలోని ప్రధాన మండలాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రెండు రాష్ట్రాల చెక్‌పోస్టుల వల్ల గిరిజనులకు, వాణిజ్య వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వామపక్ష తీవ్రవాద ప్రాంతం కావడం వల్ల శాంతిభద్రతల సమస్యలు ఏర్పడుతున్నాయి. భద్రాచలంలోని విద్యాసంస్థల్లో చదివే గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దేవస్థానం భూములు ఏపీలో కలవడంతో ఆలయ నిర్వహణకు ఆటంకాలు కలుగుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు నాలుగు పంచాయతీలను అత్యవసరంగా తెలంగాణలో కలపాలి.

- **పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలి...**

పసుపు పంటకు కనీస మద్దతు ధర ప్రకటించాలి. కేంద్ర సంస్థల ద్వారా కొనుగోళ్లు చేపట్టాలి. డ్రైయింగ్ ప్లాట్‌ఫాంలు నిర్మించాలి. సాగు యాంత్రీకరణ, విలువ ఆధారిత గొలుసు అభివృద్ధిపై పరిశోధనలకు, భౌగోళిక సూచిక(జీఐ) ఆధారంగా తెలంగాణ పసుపును అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రాండ్ చేయడానికి కేంద్రం సహకారం అందించాలి. విలువ ఆధారిత, సేంద్రియ సాగు, అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలపై రైతులకు శిక్షణ ఇవ్వాలి. కూలీల కొరత నివారణకు యంత్రాలను అందుబాటులోకి తేవాలి. పంట అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు వ్యవసాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలి" అని తుమ్మల కోరారు.

# రామచందర్‌రావు, ఈటలలో ఒకరికి అవకాశం!

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి సునీల్ బన్సల్ సోమవారం ఉదయం రానున్నారు. అధ్యక్ష ఎంపికలో కీలకమైన నామినేషన్ల ఘట్టం సోమవారం జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4 వరకు భాజపా రాష్ట్ర కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. నామినేషన్ వేసేది ఒకరేనని తెలిసింది.

**ఎవరి ధీమా వారిదే**

రాష్ట్ర అధ్యక్ష పదవికి మొదటి నుంచి నాలుగైదు పేర్లు వినిపించినా.. ఆదివారం పార్టీ వర్గాల్లో ఇద్దరి పేర్లపై ప్రధానంగా చర్చ జరిగింది. జాతీయ నాయకత్వం కొద్ది రోజుల క్రితమే తెలంగాణలోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు, రాష్ట్ర ముఖ్య నేతల అభిప్రాయాలను తీసుకొన్నట్టు తెలిసింది. సంఘ్ నేతలు, పార్టీలో ఆది నుంచి ఉన్న సీనియర్ నేతలు పలువురు రామచందర్‌రావు పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. మరోవైపు ఈటల పేరు చాలా కాలంగా పరిశీలనలో ఉంది. బీసీ వర్గానికి అధ్యక్ష పదవిలో పార్టీ ప్రాధాన్యం ఇస్తుందన్న చర్చ నేపథ్యంలో అధిష్ఠానం బాధ్యతలు తనకే అప్పగిస్తుందని ఈటల గట్టి ధీమాతోనే ఉన్నారు. వీరిలో ఎవరి పేరును నాయకత్వం ప్రకటిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడి పేరు ప్రకటించాక పార్టీ శ్రేణులు సంబరాలు ఘనంగా చేయాలని పార్టీ నిర్ణయించింది. ఎన్నిక నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి పార్టీ శ్రేణులు సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర భాజపా ఇంఛార్జ్ అభయ్‌పాటిల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జులై 1న ఎల్బీనగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడి పేరును పార్టీ అధికారికంగా ప్రకటించనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.



## ఎంపీ వద్దిరాజు మాజీ మంత్రి జోగు, ఎమ్మెల్యే వివేకానంద తదితర ప్రముఖులతో కలిసి క్రిసోల్ సోలార్ ఇన్ఫ్రా ప్రారంభం

హైదరాబాద్ జూన్29 (సమయం న్యూస్) : జల,థర్మల్ విద్యుత్తుకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి మెరుగైనదని,నాణ్యతతో కూడినదని,చాలా చౌకగా లభిస్తుందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.సూర్య భగవంతుడు దీనిని ప్రపంచానికి ఉచితంగా ప్రసాదిస్తున్నారన్నారు. ఎంపీ రవిచంద్ర మాజీ మంత్రి జోగు రామన్న, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద తదితర ప్రముఖులతో కలిసి హైదరాబాద్ కొంపల్లిలో ఆదివారం క్రిసోల్ సోలార్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగాఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ,కిలోవాట్లతో మొదలైన ఈ కంపెనీ మెగావాట్లకు చేరుకుందని,విదేశాలకు ఎగుమతులు కూడా చేస్తూ గిగావాట్లకు ఎదగాలని ఆకాంక్షించారు. దినదినాభివృద్ధి చెందుతూ ఈ సొంతంగా భవనం నిర్మించుకుని కార్యకలాపాలు సాగించాలని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జక్కుల సత్యనారాయణకు ఎంపీ వద్దిరాజు తన ఆశీస్సులు అందజేశారు.తమ కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎంపీ రవిచంద్ర,ఆయన సన్నిహితులు సీ.విఠల్, రౌతు కనకయ్య,మరికల్ పోత సుధీర్ కుమార్ లకు సత్యనారాయణ, డాక్టర్ పీఎల్ఎన్ పటేల్ తదితరులు ఆత్మీయ స్వాగతం పలికారు.ఎంపీ వద్దిరాజు,జోగు రామన్న,వివేకానంద,విఠల్,కనకయ్య, సుధీర్ కుమార్ లతో కలిసి రిబ్బన్ కట్ చేసి,కొబ్బరికాయలు కొట్టారు, జ్యోతి ప్రజ్వలన చేశారు.అతిథులు రవిచంద్ర,రామన్న, వివేకానందలను సత్యనారాయణ శాలువాలతో సత్కరించారు.





# ప్రశాంత చంద్ర మహలనోబిస్ ఘనంగా జయంతి వేడుకలు

ఆదిలాబాద్, జూన్29 (సమయం న్యూస్) : ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతి, 19 వ జాతీయ గణాంక దినోత్సవాన్ని పురష్కరించుకుని ఆదివారం కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా పాలనాధికారి రాజర్షి షా ప్రశాంత చంద్ర మహలనోబిస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బి.వెంకటరమణ, డివిజనల్, మండల గణాంక అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణాంకాలు, ఆర్థిక ప్రణాళికా రంగంలో మహలనోబిస్ చేసిన కృషికి గుర్తింపుగా ఏటా జూన్ 29 న 'జాతీయ గణాంక దినోత్సవం'గా జరుపుకోవాలని భారత ప్రభుత్వం తీర్మానించిందని, ఈ సందర్భంగా ప్రతీ సంవత్సరం జూన్ 29న జాతీయ గణాంక దినోత్సవం'గా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జాతీయాదాయాన్ని అంచనా వేయడంలో, ప్రభుత్వ విధానాలను రూపొందించడంలో గణాంకాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని వీటిని సేకరించే కార్యక్రమాలను అభివృద్ధి చేయడంతోపాటు గణాంక కార్యకలాపాలను సమన్వయం చేయడానికి మహలనోబిస్ వివిధ సంస్థలు, పద్ధతులను ఏర్పాటు చేశారన్నారు. అందుకే 'ఆధునిక భారత గణాంక పితామహుడి' గా పిలుస్తారన్నారు. సామాజిక, ఆర్థిక ప్రణాళికల్లో గణాంకాల ప్రాముఖ్యాన్ని ప్రజలకు తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశమన్నారు.

*** మహలనోబిస్ జీవితంలోని ముఖ్య విశేషాలు**

1931, డిసెంబరు 17 న కోల్కత్తలో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ (ఐఎస్ఐ)ను ఏర్పాటు చేశారు. 1947 51 ఐక్యరాజ్యసమితి సబ్ కమిషన్ ఆన్ సాంప్లింగ్కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం జాతీయాదాయాన్ని అంచనా వేయడానికి, గణాంకాల సేకరణకు ఒక సమగ్ర పద్ధతిని రూపొందించడానికి 1949లో జాతీయాదాయ అంచనాల కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి మహలనోబిస్ అధ్యక్షుడిగా, డి.ఆర్. గార్గిల్, డాక్టర్ వీకేఆర్వీ రావు సభ్యులుగా ఉన్నారు. దీన్నే 'హై పవర్ ఎక్స్పర్ట్ కమిటీ' అంటారు. 1950లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షులుగా వ్యవహరించారు. 1950లో నేషనల్ శాంపిల్ సర్వేను ఏర్పాటు చేశారు. 195567 వరకు భారత ప్రణాళికా సంఘంలో సభ్యుడిగా ఉన్నారు. మహలనోబిస్ 1893, జూన్ 29 న నాటి బెంగాల్ ప్రెసిడెన్సీలోని కోల్కత్తలో జన్మించారు. ఈయన 1936లో 'మహలనోబిస్ డిస్టెన్స్' అనే భావనను ప్రవేశపెట్టారు. గణాంకాల సేకరణలో ఇది విప్లవాత్మక మార్పులు తెచ్చింది. రెండో పంచవర్ష ప్రణాళికలో దేశంలో పారిశ్రామికీకరణ ప్రణాళికలను రూపొందించి, అభివృద్ధి చేయడంలో ముఖ్యపాత్ర పోషించారు. 1972, జూన్ 28 న మరణించారని తెలిపారు.

# బోధన్ ఆటో నగర్ లో సమస్యలను తీర్చండి

*** ఆటో నగర్ ఇండస్ట్రియల్ పార్కు లో బడ్జెట్ లేక ఇబ్బందులు..**

నిజమాబాద్ జూన్29 (సమయం న్యూస్) : తెలంగాణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ నిర్మించిన ఆటో నగర్ ఇండస్ట్రియల్ పార్క్ బడ్జెట్ లేకపోవడం వల్ల ప్రాథమిక సౌకర్యాలకు నోచుకోలేదు, దీని కారణంగా ఈ ప్రాంత ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై దృష్టి సారించి ఆటో నగర్ సమస్యలను పరిష్కరించాలని మేము మిమ్మల్ని కోరుతున్నాము. మీకు మేము కృతజ్ఞులం. నిజామాబాద్‌లోని బోధన్ రోడ్‌లో ఉన్న ఆటోనగర్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రజలు, ట్రేడర్స్ టెక్నీషియన్స్, మెకానికల్స్, 551 యూనిట్ హోల్డర్స్ మొదలైన మేము, ఈ పారిశ్రామిక పార్క్‌లో ఎటువంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించబడలేదని మీ దృష్టికి తీసుకువస్తున్నాము. వాటిలో, స్ట్రీట్ లైట్లు, రోడ్లు, నీటి సరఫరా, గ్రీన్ లైన్ల నిర్మాణం మరియు పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచడానికి చర్యలు లేకపోవడంతో, ఆటో నగర్ ఇండస్ట్రియల్ పార్క్ చెత్త కుప్పగా మారింది. చిన్న పరిశ్రమలు పూర్తిగా మూసివేయబడ్డాయి. అందరూ మెకానిక్‌లు మొదలైనవారు, వాణిజ్య సముదాయాల యజమానులు, ఆటో మొబైల్ దుకాణాల యజమానులు పూర్తిగా నష్టాలతో బాధపడుతున్నారు. అదే ప్రాంతంలోని రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండటం వల్ల, ఎవరూ ఆటో నగర్ ఇండస్ట్రియల్ పార్క్‌ను సందర్శించడం లేదు. అన్ని మెకానిక్ ఫ్యాక్టరీలు, ఆటో విడిభాగాల దుకాణాలు మొదలైన వాటిని హైదరాబాద్ రోడ్, ఆర్మూర్ రోడ్, వర్ని రోడ్, బైపాస్ రోడ్‌లకు తరలించారు. దీని కారణంగా నిజామాబాద్ ఇండస్ట్రియల్ పార్క్ పూర్తిగా స్తంభించిపోయింది. బడ్జెట్ లేకపోవడం వల్ల ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సంబంధిత విభాగం అధికారులు చెబుతున్నారు. మాకు బడ్జెట్ లేదు, కాబట్టి మేము మీకు ఏ విధంగానూ సహాయం చేయలేమని అధికారులు చెబుతున్నారు. పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచడం, వీధి దీపాలను మరమ్మతు చేయడం, డ్రెయిన్ లైన్ శుభ్రం చేయడం వంటి మునిసిపాలిటీ నుండి మేము పొందవలసిన సౌకర్యాలకు కూడా నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ నుండి మాకు ఎలాంటి సహకారం లభించడం లేదు. కాబట్టి, ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము. మీరు ఈ ప్రాంతాన్ని పరిశీలించి పరిస్థితిని అంచనా వేయాలి. సంబంధిత శాఖ లేదా పారిశ్రామిక మంత్రి ప్రత్యేక సహకారంతో, మీరు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి నిధుల ద్వారా మరమ్మతులు చేయించి ప్రజా సమస్యలను పరిష్కరించగలిగితే, అది మీ గొప్ప దయ అవుతుంది. మీరు మా సమస్యలను పరిష్కరిస్తారని మేము ఆశిస్తున్నాము. కాబట్టి మేము మీకు చాలా కృతజ్ఞులమై ఉంటాము.. ఈ ఆటో నగర్ పరిశ్రమ ప్రాంతం 26 ఎకరాలు అని పారిశ్రామిక పార్క్ అధికారులు చెబుతున్నారు. దీని విస్తీర్ణం చిన్నది కాబట్టి, ఈ ప్రాంతం నుండి శాఖకు ఎటువంటి ఆదాయం రాకపోవడంతో మేము ప్రస్తుతం శ్రద్ధ వహించలేకపోతున్నాము. మీరు ఇక్కడే ఉండాలనుకుంటే ఇక్కడే ఉండండి, లేకపోతే అమ్మేసి వెళ్లిపోండి అని అధికారులు కూడా సమాధానం ఇస్తున్నారు. నిజామాబాద్ ఆటో నగర్ ఇండస్ట్రియల్ పార్క్ అధికారులే ఈ పరిస్థితిని సృష్టించారు. అందువల్ల, ఈ విషయంలో, మెరుగైన అభివృద్ధి కోసం ఆటో నగర్ ఇండస్ట్రియల్ పార్క్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించాలని మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము, మీకు మేము చాలా కృతజ్ఞులమై ఉంటాము.



## ఇంద్రకీలాద్రి కనక దుర్గ అమ్మకు తెలంగాణ బంగారు బోనం..

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గ అమ్మవారిని దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ వారి ఆధ్వర్యంలో విజయవాడ కనకదుర్గ అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించే ఊరేగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. దుర్గమ్మ వారికి హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల సభ్యులు బంగారు బోనం సమర్పించారు. 500 మంది కళాకారులు విచిత్ర వేషాలు, పోతురాజులు డప్పులు, కోలాటాలతో బ్రాహ్మణ విధి నుంచి ఘాట్ రోడ్డు మీద దుర్గమ్మ చెంతకు బంగారు బోనం చేరుకుంది. దేవస్థానం నుంచి ఆంధ్రప్రదేశ్ కళారూపాలైన చిన్నారుల నెమలి నృత్యం, కరగం నృత్యం, తప్పెట్లు, కోలాటం, సంప్రదాయ భజనలు ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాలు పాడిపంటలతో, సుఖశాంతులతో, అభివృద్ధి పథంలో దూసుకు వెళ్లాలని బంగారు బోనం సమర్పించారు. దుర్గగుడికి చేరుకున్న బంగారు బోనాన్ని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందుకున్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలు మేరకు, బోనం సమర్పించడానికి తెలంగాణ నుంచి వచ్చిన కమిటీ సభ్యులకు, భక్తులకు ఏటువంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ వి.కె.శీనా నాయక్ స్పష్టం చేశారు. బంగారు బోనం సమర్పణ కోసం చేసిన ఏర్పాట్లపై మంత్రి ఆనంకు ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## నర్సాపూర్ పట్టణంలో
# అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

*** అశోక్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్**





హైదరాబార్ జూన్29 (సమయం న్యూస్) : నర్సాపూర్ పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకంలో భాగంగా నిరుపేదలకు ఇల్లు ఇవ్వాలని తీసుకొచ్చిన పథకం ఈ పథకం నర్సాపూర్ పట్టణంలో ఉన్న 15 వార్డులలో ఉన్న నిరూపేదలను గుర్తించి ఇచ్చారు. కానీ ఇంకా నర్సాపూర్ పట్టణంలో ఉన్న అనేక మంది నిరుపేదలు నర్సాపూర్ గతంలో గ్రామ ఖంటం ఉండి గుడిసెలు వేసుకుని తమ తమ జీవితాని గడుపుతున్నారు వారికి ఎలాంటి రిజిస్టర్ డాక్యుమెంట్ లేకుండా ఉన్నారు అలాగే నర్సాపూర్ పట్టణంలో స్వంత ఇల్లు లేక అద్దె నివాసంలో తమ జీవితాన్ని వెళ్లదీస్తున్న వారు ఉన్నారు అలాగే స్వంత స్థలం ఉంది గుడిసెలలో నివసిస్తూ ఉన్నవారు ఉన్నారు అయినా కూడా నర్సాపూర్ పట్టణంలో ఉన్న చాలా మందికి ఇంకా ఇల్లు మంజూరు కాలేదు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నర్సాపూర్ వాసులకు నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ కూడా అలాగే ఉన్నాయి. ఇకనైనా అధికారులు నాయకులు మీడియా మిత్రులు మేధావులు స్పందించి నర్సాపూర్ పట్టణంలో నిజంగా నిరుపేదలకు నిజంగా అర్హులకు అందరికీ ఇందిరమ్మ ఇల్లు లేదా డబల్ బెడ్ రూమ్ మంజూరు చేసి 15 వార్డులలో ఉన్న మరింత మంది పెద వారిని గుర్తించి వారి స్వంత ఇంటి కలను నిజం చేసి ప్రజలకు న్యాయం చేయవలసిందిగా తమరిని అందరినీ కోరుతున్నాను.

## డ్రైవర్ లేకుండానే కారు డెలివరీ

ప్రపంచంలోనే తొలిసారి డ్రైవర్ లేకుండా కారును డెలివరీ చేసి టెస్లా రికార్డు సృష్టించింది. తమ కారు సెల్ఫ్ డ్రైవింగ్ స్కిల్స్ ఏంటో తెలిసేలా టెస్లా ఓ వీడియో పోస్ట్ చేసింది. టెక్సాస్ గిగా ఫ్యాక్టరీ నుంచి 30 ని.లు డ్రైవ్ చేసుకుని టెస్లా కారు తన ఓనర్ ఇంటికి చేరుకుంది. పార్కింగ్ స్లాట్స్, హైవేలు దాటుకుంటూ దానంతట అదే వచ్చేసింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరలవుతోంది..

## వరంగల్ ఏ. ఎస్పీగా శుభం ప్రకాష్

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ డివిజన్ ఏ. ఎస్పీగా ఎన్. శుభం ప్రకాష్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 ఐ. పి. ఎస్ బ్యాచ్ కు చెందిన శుభం 2024 సంవత్సరంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ఆరు నెలల పాటు ట్రైనీ ఐ. పి. ఎస్ గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం వరంగల్ ఏసీపీ గా పనిచేస్తున్న నందిరాం నాయక్ డిజిపి కార్యాలయంకు బదిలీ అయ్యారు.







ఈరోజు కేంద్రమంత్రి శ్రీ అమిత్ షా గారి చేతుల మీదుగా నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గౌరవ శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి గౌరవ అనసూయ సీతక్క పాల్గొన్నారు.



# నూతన ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తా

**- సిజేఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**

గుమ్మడిదల ,జూన్ 29, సమయం న్యూస్ : మండల కేంద్రమైన జిన్నారంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పోచమ్మ తల్లి దేవాలయానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని సిజేఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి సహకారం అందించాల్సిందిగా కోరారు ఆలయ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆలయ నిర్మాణాలు ఆధ్యాత్మిక శోభను పెంచుతాయని ఆయన తెలిపారు. ఎల్లవేళలా ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు దైవ భక్తి కలిగి ఉండాలని ఆయన సూచించారు .ఈ సందర్భంగా జిన్నారం నాయకులు గోవర్ధన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి ,సీనియర్ నాయకులు భోజిరెడ్డి ,మాజీ వార్డు సభ్యులు శ్రీధర్ గౌడ్,, లింగం , రమేష్, బ్రహ్మేందర్ గౌడ్, వెంకటేష్, ఏర్పుల శ్రీనివాస్ ,రాఘవేందర్ రెడ్డి అంజిరెడ్డి ,నిఖిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మహంకాళి జాతరకు పటిష్టమైన ఏర్పాట్లు చేయండి

*** మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

హైదరాబాద్ జూన్29 (సమయం న్యూస్) : మహంకాళి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బోనాల ఉత్సవాలలో భాగంగా ఘటాల ఎదుర్కోళ్ళు సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఘటాలకు అలంకరించే ఆభరణాలను ఎమ్మెల్యే అందజేశారు. ముందుగా ఆలయ అధికారులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట ఆలయ EO మనోహర్ రెడ్డి, ట్రస్టీ కామేష్, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, BRS పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, సతీష్, మహేష్ యాదవ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

**ఫలహారం బండి ఊరేగింపు**

మహంకాళి మాణిక్యాలమ్మ సేవా సమితి, కటారి మహేష్ ఆధ్వర్యంలో రంగ్రేజ్ బజార్ లో నిర్వహించిన తొట్టెల ఊరేగింపు, ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. పూజలు నిర్వహించి ఊరేగింపు ను ప్రారంభించారు.



# ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు అభినందనీయం

*** నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి వరంగల్ (పశ్చిమ) శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి**

*** ఫుడ్ ఫెస్టివల్ ను ప్రారంభించిన శాసనసభ్యులు మేయర్ కూడా చైర్మెన్ కమిషనర్...**

వరంగల్ జూన్, 29 (సమయం న్యూస్): ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు అభినందనీయమని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి వరంగల్ (పశ్చిమ)శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ - (మెప్మా) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ భద్రకాళి బండ్ లో ఏర్పాటుచేసిన స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ (వీధి ఆహార విక్రయాదారుల వంట కళల ప్రదర్శన, అమ్మకం) ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ లో భాగం గా వందరోజుల ప్రణాళిక అమలు కార్యక్రమంలో భాగంగా జూన్ 2 న ప్రారంభించడం జరిగిందని జీ డబ్ల్యు ఎం సి ఆధ్వర్యంలో వరంగల్( పశ్చిమ) నియోజక వర్గ పరిధి లో భద్రకాళి బండ్ పైన ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం జరిగిందని కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం విజయవంతం గా ఏర్పాటు చేయడం జరిగిందని, తొలిసారిగా భద్రకాళి బండ్ పైన తదుపరి ఖిలా వరంగల్, ఎనుమాముల ప్రాంతంలో కూడా ఫెస్టివల్ ఏర్పాటు చేయడం 100 రోజులలో మూడు వివిధ ప్రాంతాల్లో మెప్మా ద్వారా కార్యక్రమాల్ని చేపట్టడం జరుగుతుందని మేయర్ అన్నారు.

# క్షేత్రస్థాయి పర్యటనలో అరుదైన రికార్డు సాధించిన కలెక్టర్

*** 01 జులై -2024 నుండి ఈరోజు 29-6-2025వరకు 255 రోజులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసిన కలెక్టర్**

*** మెదక్ జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాలపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రత్యేక కథనం**

*** ఏడాది కాలంలో కలెక్టర్ సాధించిన ప్రగతి ప్రస్తావన**





మెదక్ జూన్29 (సమయం న్యూస్) : తెలంగాణ ప్రభుత్వ ఆదేశానుసారం గడిచిన ఏడాది కాలంలోగత పార్లమెంట్ ఎలక్షన్స్ మోడల్ కోడ్ ముగిసిన అనంతరం 01 జూలై 2024 నుండి 29 062025 వరకు ఒక సంవత్సరకాలం సుమారుగా 255 రోజులపాటు క్షేత్ర స్థాయి పర్యటనలలో నిమగ్నమై ఉన్నారు. ఈ సంవత్సరకాలం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 280 రోజులు ఉంటే సుమారుగా 90% రోజులు క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు.

**వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్ర ప్రభుత్వ సూచనలు సలహాలు పాటిస్తూ వ్యవసాయరంగం పై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ క్షేత్రస్థాయిలో పంట పొలాలలో రైతులను నేరుగా కలిసి వ్యవసాయ స్థితిగతులను తెలుసుకొని రైతులు ఒకే పంటపై ఆధారపడకూడదని అంతర్ పంటల సాగు ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందాలని తెలియజేస్తూ .రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు కలెక్టర్ వివిధ మార్గాలను అన్వేషించి తద్వారా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా



ప్లాన్ చేసి అమలు చేయడానికి రైతులతో సంభాషించడం మరియు వారి నుండి ప్రత్యక్ష అభిప్రాయాన్ని తీసుకోవడం మరియు మంచి నాణ్యమైన విత్తనాలు మరియు ఎరువులను నిర్ధారించడం, 2024 25 రబీలో రికార్డు స్థాయిలో 3.2 మెట్రిక్ టన్నుల వరి సేకరణ, గత 4 సంవత్సరాలలో ఇదే అత్యధికంగా ఉన్నాయి.

**ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠ శాలలు వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడానికి కలెక్టర్ స్వయంగా రాత్రి బస మరియు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తానే స్వయంగా ప్రతి పాఠశాలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారానికి కావలసిన ప్రణాళికలను రూపొందించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందించడానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రవేశపెట్టి విద్యా నైపుణ్యాలు పెంచే దిశగా కృషి చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో 562 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ నాణ్యమైన గుణాత్మక విద్యను అందించడానికి గణితం, విజ్ఞాన శాస్త్రంలో సాధించడంలో భాగంగా గ్రౌండ్ బేస్ లెర్నింగ్ విధానాన్ని జిల్లాలో అమలు చేయడం జరిగింది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం ఫలితంగా పదవ తరగతిలో 97 %ఉత్తమ ఫలితాలు సాధ్యపడ్డాయి.

*** జిల్లాలో ఆరోగ్య రంగాన్ని మరింత మెరుగుపరిచే దిశగా అడుగులు**

ప్రభుత్వ సలహాలు సూచనలు పాటిస్తూ వైద్య ఆరోగ్య శాఖను మరింత పట్టిష్టం చేస్తూ ప్రజలకు సమగ్ర వైద్యం అందించేందుకు జిల్లా కలెక్టర్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, సీసీటీవీ కెమెరాలు ద్వారా ఆసుపత్రి సిబ్బంది సమయపాలనపై ప్రత్యేక దృష్టిసారించడం వల్ల వైద్య సిబ్బంది తమ విధులను క్రమశిక్షణగా నిర్వహిస్తూ సెలవు రోజుల్లో కూడా అందుబాటులో ఉంటున్నారు అందుబాటులో ఉన్న వసతులపై సమీక్షలు చేపడుతున్నారు. వైద్య సేవల నాణ్యత మెరుగుపరచే దిశగా అవసరమైన ఆధునిక వైద్య పరికరాల సమకూర్పుపై దృష్టి సారించారు. ప్రతి ఒక్క రోగికి సరైన సేవలు అందేలా వైద్య సిబ్బందికి మార్గనిర్దేశం చేసి, పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేశారు.

## ప్రముఖ సోషల్ యాక్టివిస్ట్ డా. కిఫాయత్ ఎం.డి కి

# భారతీయ పద్మభూషణ్ సమ్మాన్ అవార్డు

*** త్రివిధ దళపతుల చేతుల మీదుగా సన్మానం స్వీకరించిన గౌరవ విజేత**

హైదరాబాద్ 29, జూన్ ( సమయం న్యూస్) : భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ, ప్రధానమంత్రి ఆడిటోరియంలోఘనంగా నిర్వహించిన ఒక అవార్డు కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల రక్షణ కమిషన్ జాతీయ ఉపాధ్యక్షుడు, తెలంగాణ సమాచార హక్కు చట్టం సాధనా కమిటీ రాష్ట్ర కన్వీనర్ డా. కిఫాయత్ ఎం.డి కు భారతదేశం గర్వించదగ్గ భారతీయ పద్మభూషణ్ సమ్మాన్ అవార్డు ప్రదానం చేయడం అత్యంత గౌరవదాయకమైన ఘట్టంగా నిలిచింది. ఈ పురస్కారం భారత త్రివిధ దళాలకు చెందిన మేజర్ జనరల్స్ (ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్) చేతుల మీదుగా అందించడం ఈ ఘనతకు మరింత విలువను చేకూర్చింది. మానవ హక్కుల పరిరక్షణ, సమాచార హక్కు చట్ట సాధన, సామాజిక సేవల్లో సిన్సియర్ గా కొనసాగుతున్న కృషికి ఆయనకు ఇది ఒక విలక్షణమైన గుర్తింపు. పేదల కోసం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న వ్యక్తిత్వానికి దేశ స్థాయిలో లభించిన ఈ గౌరవం సామాజిక సేవను జీవిత ధ్యేయంగా భావించే ప్రతి ఒక్కరికి ప్రేరణ కలిగించే అంశం. ఈ





శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మిత్రులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు, సామాజిక వేత్తలు, నేడు అభినందనలతో, ప్రశంసల వెల్లువలో ముంచెత్తుతున్నారు. మౌనోద్యమం ద్వారా నడిపిన ఉద్యమానికి ఈ గుర్తింపు వెలకట్టలేని పురస్కారం. తెలంగాణకు తలఎత్తుకునే గౌరవాన్ని, కన్న తల్లిదండ్రులకు, కుటుంబానికి పుట్టిన గడ్డకు మంచి గౌరవాన్ని గుర్తింపును తీసుకొచ్చిన క్రమంలో, ఈ ఘనత యావత్ యువతలో సేవా స్ఫూర్తిని రగిలించేలా నిలుస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. డా. కిఫాయత్ ఎం.డి కు హృదయపూర్వక అభినందనలు - ఇదే స్ఫూర్తితో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించే ప్రేరణ కావాలని ఆకాంక్ష.

## నిజామాబాద్ పర్యటనకు విచ్చేసిన

# కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఘన స్వాగతం

నిజామాబాద్, జూన్ 29(సమయం న్యూస్) : నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కేంద్ర హోం మంత్రి మధ్యాహ్నం 2.15 గంటలకు నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (న్యూ కలెక్టరేట్)కు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అమిత్ షాకు బొకేలు అంధించి స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అమిత్ షా వెంట హెలికాప్టర్ లో నిజామాబాద్ కు విచ్చేయగా, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ అరవింద్, అర్బన్



ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జాతీయ నాయకులు కే.లక్ష్మణ్, కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తదితరులు అమిత్ షాకు సాదర స్వాగతం పలికారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ప్రత్యేక కాన్వాయ్ లో కేంద్ర హోం మంత్రి వినాయక నగర్ చేరుకుని నూతనంగా నెలకొల్పిన జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. అక్కడి నుండి కాన్వాయ్ ద్వారా బస్వా గార్డెన్ చేరుకుని, పసుపు బోర్డు ప్రారంభోత్సవ సమావేశంలో పాల్గొని పసుపు రైతులు, బోర్డు అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, పసుపు బోర్డు అధికారులు, రైతులు పాల్గొన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధికారికంగా పాల్గొన్న కార్యక్రమాలకు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

# మంత్రి నారా లోకేష్ తో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాటామంతి

మంగళ గిరి జూన్29 (సమయం న్యూస్) : మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఏడాది పాలనపై పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ తో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న వీరు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకున్నారు. ఆనంతరం పార్టీ ఏడాది పాలనపై ఇరువురి మధ్య ఆసక్తికర సంభాషన కొనసాగింది. జిల్లా స్థితిగతులపై ఈ సందర్భంగా చర్చించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఊహించని విజయం వెనుక కార్యకర్తల కష్టం ఎంతో ఉందని చర్చించుకున్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ (కబ్) వ్యవస్థ వల్లే పార్టీ క్షేత్రస్థాయిలో బలపడిందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి అచ్చెన్నకు సూచించారు మంత్రి లోకేష్ . పార్టీకి నాలుగు దశాబ్దాలుగా సీనియర్లు అండగా నిలిచారని, సీనియర్ల అనుభవాన్ని, యువత శక్తిని జోడించి పార్టీని ముందుకు నడపాల్సిన అవసరం ఉందని అన్నారు. బాగా పనిచేసిన కార్యకర్తలను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించి, సత్కరించాలని తెలిపారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను



ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు.

# మెడికల్ డి-కోడింగ్ వర్క్ షాప్ ప్రారంభించిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

* **ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి:నాయిని**

హన్మకొండ29 (సమయం న్యూస్) : హన్మకొండ అంబెడ్కకర్ భవన్ లో నిర్వహించిన మెడికల్ డీకోడింగ్ వర్క్ షాప్ ను పశ్చిమ నియొజకవర్గ శాసనసభ్యులు గౌ.నాయిని రాజేందర్ రెడ్డి గారు ముఖ్య అతిదిగా హజరై ప్రారంబించారు ఈ సందర్బంగ అయన మాట్లాడుతూ మన వరంగల్ నగరంలో ఇలా ఒక గొప్ప మెగా వర్క్షాప్ జరుగుతుండటం గర్వంగా ఉందని మెడికల్ డికోడింగ్ అనేది ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చాలా పెద్ద కెరీర్ మార్గం అవుతోంది. మీరు INDIA నుంచే US, UK లాంటి దేశాలకు కోడ్ చేసే అవకాశం పొందుతున్నారని ఇదే





డిజిటల్ ఇండియా శక్తి అని అన్నారు. Thought Flows వంటి అకాడమీ ఇప్పటి వరకు 30,000 మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును నిర్మించింది. ఇది గర్వించదగిన విషయం. ఈ రోజు మీరు తీసుకున్న ఈ ఒక అడుగు, రేపటి గొప్ప కెరీర్‌కు మొదటి మెట్టు అవుతుందని అన్నారు. కార్యక్రమం నిర్వాహకులైన Thought Flows టీమ్‌ని అభినందించి ఇలాంటి కార్యక్రమాలకు మా సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియొగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. అంతకుముందు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిగారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్, బంక సరళ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారి అల్లుడు విష్ణు వర్ధన్ రెడ్డి, బంక సతీష్,యూత్ నాయకులు కేతిడి దీపక్ రెడ్డి, రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## హామ్‌స్టెక్ క్రియేటర్స్ కలెక్ట్ 2025, సృజనాత్మకతకు హైదరాబాద్ వేదిక

హైదరాబాద్, జూన్ 29, (సమయం న్యూస్): హామ్‌స్టెక్ కాలేజ్ వార్షిక కార్యక్రమం 'క్రియేటర్స్ కలెక్ట్ 2025' ఈ రోజు హిట్‌ఎక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో వైభవంగా జరిగింది. ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్, ఫోటోగ్రఫీ, గ్రాఫిక్ డిజైన్, మేకప్ ఆర్టిస్ట్రీ, కలినరీ ఆర్ట్స్ రంగాల్లో 800 మందికిపైగా విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ వేడుకలో నిర్వహించిన ఫ్యాషన్ షోకు నీతా లుల్లా దర్శకత్వం వహించగా, ఫోటోగ్రఫీ ప్రదర్శనకు అవినాష్ గోవరికర్, గ్రాఫిక్ డిజైన్ డిస్‌ప్లేకు కైలాష్ నాయక్ సలహా ఇచ్చారు. సెలబ్రిటీ మెంటర్ల మార్గదర్శనంతో విద్యార్థుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి దామోదర్ రాజా నరసింహ, ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. జయంతి రెడ్డి,



గౌరంగ్ షా, అర్వింద్ చెంజీ, ప్రవీణ్ పుడి తదితరులు న్యాయనిర్ణేతలుగా పాల్గొన్నారు. 5,000 మందికిపైగా సందర్శకులు ఈ సృజనోత్సవాన్ని వీక్షించారు. హామ్‌స్టెక్ సీఈఓ అజితా రెడ్డి మాట్లాడుతూ, "ఇది ప్రతిభకు అవకాశాల వేదిక. పరిశ్రమ, కళల ప్రపంచం ఎదురుచూస్తున్న కొత్త టాలెంట్ ఇక్కడ కనిపించింది" అని పేర్కొన్నారు. సృజనాత్మకత, నూతన ఆలోచనలు, యువత శ్రమకు అద్దంపట్టిన ఈ వేడుక, హైదరాబాద్ సాంస్కృతిక రంగానికి ఒక కొత్త ఒరవడిని తీసుకొచ్చింది.


కొడకంచిలో నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం

# డబుల్ బెడ్ రూమ్ కల నెరవేరేనా

* **అసంపూర్ణంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం**
* **జిన్నారం కొడకంచి లో మధ్యలోనే నిలిచిపోయిన పనులు**
* **త్వరగా పూర్తిచేసి అర్హులకు కేటాయించాలంటున్న స్థానికులు**

జిన్నారం, జూన్ 29, సమయం న్యూస్:సంగారెడ్డి జిల్లా ఉమ్మడి జిన్నారం మండలంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినడబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయి . పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలలోకి వెళితే గత బిఆర్ఎస్ ప్రభుత్వం మొదటి విడత డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ఉమ్మడి జిన్నారం మండలానికి 150 ఇండ్లను కేటాయించారు. అందులో జిన్నారం గ్రామానికి 60, కొడకంచి గ్రామానికి 50, ప్రస్తుత గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి 40 ఇండ్లను కేటాయించడం జరిగింది. కొడకంచి, జిన్నారం గ్రామాలలో పనులు ప్రారంభమైనప్పటికీ, నల్లవల్లి గ్రామంలో శంకుస్థాపనతోనే పనులు ఆగిపోయాయి. కొడకంచి గ్రామపంచాయతీ పరిధిలోని పుట్టుగూడ సమీపంలోని సర్వే నంబర్ 11 లో అపార్ట్మెంట్ తరహాలో 50 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి 2019 ఫిబ్రవరి 5వ తేదీన స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కొద్దిరోజుల తర్వాత జిన్నారం, కొత్తపల్లి గ్రామాలలో కూడా ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కొడకంచిలో గత ఆరు సంవత్సరాలుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. నాలుగు బ్లాకులలో మూడంతస్తుల నిర్మాణ పనులు చేపట్టగా, రెండు బ్లాకులలో స్లాపులు వేసి వదిలేయడం జరిగింది.

**పునాది దాటని పనులు**

మండల కేంద్రమైన జిన్నారంలో 60 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులు ప్రారంభ దశలోనే ఆగిపోయాయి. గుంతలు తీసి ,పుట్టింగులు వేసి, పునాది నిర్మించి నిలిపివేశారు. గత ఐదు సంవత్సరాలుగా ఎలాంటి పురోగతి లేదు. కొత్తపల్లి గ్రామంలో శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పనుల కొనసాగింపు జరుగుతుందా, లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న గూడెం మహిపాల్ రెడ్డి ప్రస్తుత ప్రభుత్వంలో కూడా ఎమ్మెల్యేగా ఉండడం తో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులపై కొంత ఆసక్తి ఏర్పడుతుంది.


జిన్నారంలో ప్రారంభ దశలోనే నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం

*** ఇందిరమ్మ మోడల్ హౌస్ వైపే ప్రభుత్వం చూపా?**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడికి 5 లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణ పనులకు మోడల్ హౌస్ ను రూపొందించింది. మరి మండల ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరుగుతుందా లేక మోడల్ హౌస్ తరహాలోనే నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



## జూనియర్ డాక్టర్ల కు స్టాపాండ్ పెంచిన తెలంగాణ ప్రభుత్వం

* **వివరాలను వివరించిన మంత్రి దామోదర రాజనర్సింహ.**

సంగారెడ్డి జూన్29 (సమయం న్యూస్) : ప్రభుత్వ హాస్పిటళ్లలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఇంటర్న్‌షిప్ స్టైఫండ్, పీజీ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ల స్టైఫండ్స్‌ను 15 శాతం పెంచుతున్నట్టు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన జీవో 90 (dated 28.06.2025) విడుదల చేసింది. ఈ పెంపుతో ఇంటర్న్‌లకు నెలకు రూ.29,792, పీజీ డాక్టర్లకు ఫస్ట్ ఇయర్‌లో రూ.67,032, సెకండ్ ఇయర్‌లో రూ.70,757, ఫైనల్ ఇయర్‌లో రూ.74,782 చొప్పున స్టైఫండ్ అందనుంది. సూపర్ స్పెషాలిటీ స్టూడెంట్లకు ఫస్ట్ ఇయర్‌లో రూ.1,06,461, సెకండ్ ఇయర్‌లో రూ.1,11,785, థర్డ్ ఇయర్‌లో రూ.1,17,103 చొప్పున స్టైఫండ్ అందనుంది. అలాగే, సీనియర్ రెసిడెంట్లకు డాక్టర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.92,575 నుంచి రూ.1,06,461 పెంచుతున్నట్టు జీవోలో పేర్కొన్నారు. పెంచిన స్టైఫండ్స్‌ను ఇకపై ప్రతి నెలా 10వ తేదీన చెల్లించాలని అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ గారు ఆదేశించారు. ఈ మేరకు సంవత్సరానికి సరిపడా స్టైఫండ్స్ చెల్లించేందుకు అవసరమైన బీఆర్‌వోను (బడ్జెట్ రిలీజ్ ఆర్డర్) అధికారులు విడుదల చేశారు. అంతేకాదు, పెండింగ్ స్టైఫండ్ బకాయిలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. శని, ఆదివారాలు బ్యాంక్ సెలవులు కావడంతో సోమవారం జూడాల ఖాతాల్లో స్టైఫండ్ డబ్బులు జమ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సీనియర్ రెసిడెంట్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, ఇతర సిబ్బంది ఉద్యోగ కాలాన్ని మరో ఏడాది పాటు పెంచుతూ ఆర్థిక శాఖ జీవో విడుదల చేసింది. దీంతో వీరికి రెగ్యులర్ వేతనాలు చెల్లించేందుకు మార్గం సుగమం అయింది. టీచింగ్ ఫాకల్టీ సమస్యకు చెక్ (రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్స్) ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో టీచింగ్ ఫాకల్టీ సమస్యకు చెక్ పెడుతూ పలు చర్యలను ప్రభుత్వం తీసుకుంది. రెండ్రోజుల క్రితమే 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసింది. సుమారు మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ పోస్టులను సైతం త్వరలోనే భర్తీ చేయనున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అడిషనల్ డీఎంఈ వంటి పోస్టులను నేరుగా రిక్రూట్ చేసుకునే అవకాశం లేకపోవడంతో, ప్రమోషన్ల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తున్నది. ఇందుకోసం ప్రభుత్వం ప్యానెల్ ఇయర్ రిలాగ్జేషన్ సైతం ఇచ్చినట్టు మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న సుమారు 231 మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 308 మందికి, ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇచ్చింది. ఈ చర్యలో అన్ని కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీల సమస్య తీరనున్నది. అర్హత కలిగిన 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లుగా ప్రభుత్వం ప్రమోషన్లు ఇచ్చింది. ఈ ప్రమోషన్లతో రాష్ట్రంలోని 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్స్, టీచింగ్ హాస్పిటళ్లకు రెగ్యులర్ సూపరింటెండెంట్లు రానున్నారు.

# డైట్ ఛార్జీల పెంపునకు కృషి

* **రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
* **వర్షా కాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి**
* **హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపండి**
* **బీసీ హాస్టల్ వార్డెన్లతో మంత్రి సవిత**

తాడేపల్లి/అమరావతి29 (సమయం న్యూస్): హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్ ఛార్జీల పెంపునకు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తాజా ఆహారాన్ని మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను రాష్ట్ర బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘ ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, మంత్రిని వారు ఘనంగా



సత్కరించారు ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైందని, ఇప్పటికే ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసిందని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తాజా ఆహారం, మరిగించి చల్లార్చిన నీరు మాత్రమే అందించాలని స్పష్టంచేశారు. విద్యార్థులకు జలుబు, తలనొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే, తక్షణమే అందుబాటులో ఉన్న వైద్యులతో వైద్య సేవలందించాలన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు. డైట్ ఛార్జీల పెంపు విషయమై ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీసీ హాస్టళ్లకు మాత్రమే కాకుండా సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల హాస్టళ్లకు సంబంధించి డైట్ ఛార్జీలపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే డైట్ ఛార్జీల పెంపు విషయమై నిర్ణయం వెలువడే అవకాశముందన్నారు. నాలుగో తరగతి ఉద్యోగాలు, హెచ్ డబ్ల్యూవోల ఖాళీ పోస్టుల భర్తీ, ఏబీసీ డబ్ల్యూవోల పదోన్నతల అంశాలను కూడా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా హాస్టళ్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొరన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు కేటాయిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రి సవితకు రాష్ట్ర బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘు ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, గౌరవ అధ్యక్షులు దయానంద్ రాజు, రాష్ట్ర అసోయేషిట్ ప్రెసిడెంట్ రాజోలు శ్రీను, సాగర్ బాబు సహా వివిధ జిల్లా అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పి సీ మోహాలోనోబిస్ 132 వ జయంతి సందర్భంగా19 వ జాతీయ అర్ద గణ దినోత్సవ వేడుకలు

సూర్యాపేట.జూన్29 (సమయం న్యూస్) : జిల్లా కలెక్టర్ కార్యాలయం 1సమావేశ మందిరంలొ పి. సి. మెహలోనోబిస్ గారి 132వ జయంతి సందర్భంగా 19వ జాతీయ అర్థ గణాంక దినోత్సవ వేడుకలు ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్. కిషన్ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదులుగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నంద్ లాల్ పవార్, ఐ.ఏ.ఎస్., గారు పాల్గొని మెహలోనిబిస్ గారి చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళి అర్పించి, ఇట్టి కార్యక్రమాని ఉద్దేశించి మాట్లాడుతూ పి. సి. మెహలనోబిస్ గారు అనువర్తిత గణాంకశాస్త్రవేత్త అని, భారత ప్రణాళిక పథానికి నిర్దేశకుడిగా మరియు భారతదేశ మొదటి ప్లానింగ్ కమీషన్లో సభ్యుడగా పానిచేశారని ఆదేవిదంగా గణాంక ఆధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని, ఎప్పటికపుడు నూతన సాంకేతిక పద్దతులను నేర్చుకుంటూ, వేగంగా సమాచారాన్ని ఉన్నత అధికారులకు అంధించాలని, మండల స్థాయిలో సామాజిక, ఆర్థిక అంశాలపై విశ్లేషణ



చేయాలని, భవిష్యత్ ప్రణాళికలు తయారుచేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషిచేయాలని తెలిపారు.

# వాళ్లిద్దరికీ తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరగడం అసాధ్యం

* కేసీఆర్, కేటీఆర్‌ల ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరగదన్న టీపీసీసీ చీఫ్
* మహా న్యూస్ పై బీఆర్ఎస్ కార్యకర్తల దాడిని తీవ్రంగా ఖండన
* సినీ ప్రముఖులు, జడ్జిల ఫోన్లను ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చింది? అంటూ ప్రశ్న
* మహిళల ఫోన్లు ట్యాప్ చేసి వారి కుటుంబాల్లో చిచ్చుపెట్టారని ఆగ్రహం





* అభ్యంతరాలుంటే దాడులు కాదు, చట్టపరంగా ముందుకెళ్లాలని హితవు

తెలంగాణను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లకు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరగడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఒక మీడియా ఛానల్‌పై బీఆర్ఎస్ శ్రేణులు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. వివిధ వర్గాల ఫోన్లను ట్యాప్ చేయడంపై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాజకీయ నేతలే లక్ష్యమైతే, వారి కుటుంబ సభ్యులైన మహిళల ఫోన్లను ఎందుకు ట్యాప్ చేశారు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థులే కాకుండా, సినీ తారలు, న్యాయమూర్తులు, మహిళా అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్యల వల్ల ఎంతో మంది కుటుంబాల్లో లేనిపోని చిచ్చు పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సినీ ప్రముఖుల వ్యక్తిగత సంభాషణలను దొంగచాటుగా వినాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ఏదైనా విషయంపై అభ్యంతరాలు ఉంటే, ప్రజాస్వామ్యంలో చట్టపరంగా పోరాడాలని, అంతేగానీ మీడియా సంస్థలపై భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని మహేశ్ కుమార్ గౌడ్ హితవు పలికారు. బీఆర్ఎస్ నాయకత్వం ఇటువంటి దాడులను ప్రోత్సహించవద్దని, చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిజానిజాలు విచారణలో తేలతాయని, బాధ్యులెవరైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని ఆయన అన్నారు.



## మెగా డీఎస్సీ..
## జులై 1, 2 తేదీల్లో పరీక్షకు కొత్త హాల్ టికెట్లు

అమరావతి: జులై 1, 2 తేదీల్లో డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులు apdsc.apcfss.in సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏపీ పాఠశాల విద్యాశాఖ సూచించింది. యోగా దినోత్సం సందర్భంగా జూన్ 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన మెగా డీఎస్సీ 2025 నియామక పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. జూలై 1, 2 తేదీల్లో జరిగే పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలను మార్చిన కొత్త హాల్ టికెట్లను అధికారులు మంజూరు చేస్తున్నారు. కొత్త హాల్ టికెట్లలో పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలు నిర్థారించుకుని హాజరు కావాలని అధికారులు సూచించారు. ఇవాళ జరిగిన ప్రిన్సిపల్ పరీక్షకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగు పరీక్షకు 19,750 మంది అభ్యర్థులకు గాను 18,231 మంది హాజరయ్యారని అధికారులు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో 97.81శాతం, నెల్లూరు జిల్లాలో 88.04 శాతం అత్యధికంగా హాజరు నమోదైందని తెలిపారు.

## మమ్మల్ని పట్టుకోలేరు...
## బీజేపీ ఎంపీ రఘునందన్ కు మరోసారి బెదిరింపులు

* బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి బెదిరింపు కాల్స్
* 'ఆపరేషన్ కగార్' ఆపాలంటూ ఆగంతకుల డిమాండ్
* ఏపీ మావోయిస్టు కమిటీ పేరుతో ఇంటర్నెట్ ద్వారా ఫోన్లు
* హైదరాబాద్‌లోనే ఐదు బృందాలున్నాయని హెచ్చరిక
* ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఘటన.. పోలీసులకు ఫిర్యాదు
* కొద్ది రోజుల క్రితమే ఓసారి హెచ్చరికలు.. అదనపు భద్రత ఏర్పాటు



తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు, ప్రాణహాని తలపెడతామంటూ మరోసారి హెచ్చరికలు వచ్చాయి. ఆదివారం రెండు వేర్వేరు ఫోన్ నంబర్ల నుంచి కాల్స్ చేసిన ఆగంతకులు, ఛత్తీస్ గఢ్ లో 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తాము ఏపీ మావోయిస్టు కమిటీకి చెందిన వారిమని, తమ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక బృందాలు ఇప్పటికే హైదరాబాద్‌లో రంగంలోకి దిగాయని వారు చెప్పినట్టు సమాచారం. "మా టీమ్‌లు నగరంలోనే ఉన్నాయి. మరికాసేపట్లోనే నిన్ను చంపేస్తాం. దమ్ముంటే నిన్ను నువ్వు కాపాడుకో" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పోలీసులు తమ ఫోన్లను ట్రేస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నా తమ ఆచూకీ దొరకదని, ఎందుకంటే తాము ఇంటర్నెట్ కాల్స్ ఉపయోగిస్తున్నామని ఆ వ్యక్తులు స్పష్టం చేశారు. ఏ పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని వారు తేల్చిచెప్పినట్లు తెలిసింది. రఘునందన్‌రావుకు ఇలాంటి బెదిరింపులు రావడం ఇది రెండోసారి. గత జూన్ 23న తొలిసారిగా ఆయనకు బెదిరింపు కాల్ వచ్చింది. ఆ సమయంలోనే ఆయన రాష్ట్ర డీజీపీతో పాటు మెదక్, సంగారెడ్డి ఎస్పీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచి, ఎస్కార్ట్ వాహనంతో పాటు అదనపు సిబ్బందిని కేటాయించింది. అయినప్పటికీ బెదిరింపులు ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల క్రితమే కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న రఘునందన్‌రావు, ప్రస్తుతం ఆసుపత్రిలోనే కోలుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజా బెదిరింపులు రావడంతో ఆయన ఆసుపత్రి నుంచే మరోమారు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.


## స్టాఫ్ నర్సుపై కేసు ..
## నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం

నెల్లూరు: మరో స్టాఫ్‌నర్సు ఆత్మాహత్యాయత్నం చేసిన ఘటన నెల్లూరు జిల్లా ఏఎస్ పేట ప్రభుత్వాసుపత్రిలో చోటు చేసుకుంది. స్టాఫ్ నర్స్ తోట లక్ష్మి నిద్రమాత్రలు మింగారు. లక్ష్మి వేధిస్తుందంటూ శనివారం ఇదే ఆస్పత్రిలో దొరసానమ్మ అనే నర్సు ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో పోలీసులు లక్ష్మిపై కేసు నమోదు చేశారు. తనపై కేసు నమోదు కావడంతో ఆదివారం లక్ష్మి ఆత్మహత్యకు యత్నించారు. సమచారం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## రాగల 3 రోజులు ఉత్తర కోస్తా, యానాంలో వర్షా లు

అమరావతి: రాష్ట్రంలో రాబోయే 3 రోజులు వాతావరణ పరిస్థితులను అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దక్షిణ రాజస్థాన్, ఉత్తర గుజరాత్ మీదుగా ఉపరితల ఆవర్తనం నుంచి వాయువ్య బంగాళాఖాతం వరకు తూర్పుపశ్చిమ ద్రోణి కొనసాగనుంది. మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, ఉత్తర ఒడిశా మీదుగా అల్పపీడన ప్రాంతంతో సంబంధం ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు ఈ ద్రోణి కొనసాగనుంది. సగటు సముద్ర మట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల మధ్య విస్తరించి ఎత్తుకు వెళ్లేకొలది దక్షిణ దిశగా ద్రోణి వంగి ఉన్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణలో పశ్చిమ గాలులు వీయనున్నాయి. ఉత్తర కోస్తా, యానాంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు గంటకు 40-50 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దక్షిణ కోస్తా, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకట్రెండుచోట్ల కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



## ఎస్వీ విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళం

తిరుమల: చెన్నైకు చెందిన టీవీఎస్ క్యాపిటల్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తితిదే ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళంగా అందించింది. విరాళం చెక్కును సంస్థ సీఎండీ గోపాల్ శ్రీనివాసన్ తిరుమలలో తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.



## కేసీఆర్ అంటేనే ఉద్యమం, అభివృద్ధి : హరీష్ రావు

కేసీఆర్ లేకపోతే తెలంగాణ ఆనవాళ్లు లేనట్టేనని బీఆర్ఎస్ నాయకుడు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలోని అమరచింతలో నేడు తెలంగాణ మలిదశ ఉద్యమ కళాకారుడు సాయిచంద్ రెండవ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో హరీష్‌రావు పాల్గొన్నారు. అమరచింత కొత్త బస్టాండ్ ఆవరణలో సాయిచంద్ ఏడు అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. హరీష్ రావు తన ప్రసంగంలో సాయిచంద్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, రాష్ట్ర సాధన కోసం జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శిస్తూ, "రేవంత్ రెడ్డి ఒక్కసారైనా 'జై తెలంగాణ' అన్నారా?" అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసీఆర్ ఆనవాళ్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని, కానీ కేసీఆర్ లేకపోతే తెలంగాణ ఆనవాళ్లు లేనట్టేనని ఆయన అన్నారు. హరీష్ రావు కేసీఆర్‌ను తెలంగాణ ఉద్యమం, అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా అభివర్ణించారు, ఆయన నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలను, సంక్షేమ పథకాలను కొనియాడారు. ఈ సభలో సాయిచంద్‌ను స్మరిస్తూ, ఆయన తెలంగాణ ఉద్యమంలో చేసిన కృషిని కొనియాడారు.



## గోదావరి-బనకచర్లపై మంగళవారం పీపీటీ

ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి బనకచర్లపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రజాప్రతినిధులందరికీ నిజనిజాలు తెలిపేలా ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగా ఆయన నీటిపారుదల రంగ అధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బతింటాయో సమగ్రంగా వివరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డాక్టర్ జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్యఅతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం హాజరుకానుంది. అంతేకాకుండా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు, శాసన మండలి, శాసనసభ్యులతోపాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ విభాగాలకు చెందిన కమిషన్ల చైర్మన్లు, సభ్యులు పాల్గొననున్నారు.



# పగటిపూట... కళ్లద్దాలు తీసేయొచ్చు..!

**ఆఫీసుకెళ్తూనో, స్కూల్‌కెళ్తూనో పొరపాటున కళ్లద్దాలని మర్చిపోతే ఇక ఆ బాధ పడేవాళ్లకే తెలుస్తుంది... అడుగడుగునా ఇబ్బందే! డ్రైవింగ్ చేయాలంటే భయం, దూరంగా ఉన్నవి చదవాలంటే చిక్కు... ఒక్క మాటలో చెప్పాలంటే ఆ రోజంతా చేతులు కట్టేసినట్టే! ఆ చిక్కులకు చెక్ పెట్టేందుకు వచ్చినవే ఆర్థో కె- లెన్స్...**






ఏడేళ్ల ఆద్విక్ కళ్లద్దాలు లేకుండా స్కూల్‌కి వెళ్లలేని పరిస్థితి... కానీ స్కూల్లో తోటి పిల్లలు వాటిని చూసి వెక్కిరిస్తూ, దాచి పెట్టి ఆటపట్టిస్తుంటే అమ్మ దగ్గరకు వచ్చి ఏడుస్తున్నాడు. వాళ్లమ్మ అప్పటికేదో ఓదార్చినా, దీనికి ఏదైనా పరిష్కారం ఉంటే బాగుండును అనుకుంది. సంహితని పెళ్లిచూపులు చూడ్డానికి వచ్చిన అబ్బాయి 'మీరు ఆ కళ్లద్దాలు లేకపోతే ఇంకా బాగుంటారు' అన్నాడు. అవి లేకుండా ఉంటే తను బాగుండే మాట నిజమే కానీ, తనకి దూరంగా ఉన్నవేవీ కనిపించవు. అంతా అలికినట్టుగా ఉంటుంది. బస్ నంబర్లు కనిపించవు, సరిగా డ్రైవ్ చేయలేదు... అవి ఉండి తీరాల్సిందే. కళ్లద్దాలతో వచ్చే ఇలాంటి ఇబ్బందులు మనలో చాలామందికి తెలిసినవే! ఇందుకు పరిష్కారంగా కొంతమంది సర్జరీ చేయించుకుంటే, మరికొందరు కాంటాక్ట్ లెన్సులు వాడుతుంటారు. అయితే, వాటితోనూ కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ఆటలాడే పిల్లలు పదేపదే కళ్లు నలుపుతూ ఉంటే ఆ లెన్సు పడిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా వాటిని తీసేస్తే పోలా! అరె.. అదెలా సాధ్యం, వాటిని తీసేస్తే సరిగా కనిపించదు కదా అంటారా... అదీ నిజమే కానీ, ఇలా కళ్లద్దాలూ, లెన్సులతో వచ్చే చిక్కులను తొలగించేందుకు వచ్చినవే 'ఆర్థో కెరటాలజీ లెన్స్', సంక్షిప్తంగా ఆర్థో కె లెన్స్ అంటారు. ఆర్థో అంటే నేరుగా అనీ, కెరటో అంటే కార్నియా అనీ అర్థం. అంటే కార్నియాని సరిచేసే లెన్సులన్నమాట ఇవి. వీటిని రాత్రుళ్లు పెట్టుకుంటే చాలు, పగలు పెట్టుకోవాల్సిన అవసరమే లేదు. ఇదేదో మ్యాజిక్‌లా ఉందే అనుకుంటున్నారు కదా, వీటి పనితీరు ఎలా ఉంటుందో తెలుసుకుందాం.


**రాత్రుళ్లు పెట్టుకుంటే...**


దూరంగా ఉన్న వస్తువులు అస్పష్టంగా కనిపించడాన్నే వైద్య పరిభాషలో మయోపియా అంటారు. ప్రస్తుతం మనదేశంలో పాతికశాతం పిల్లలు ఈ మయోపియా సమస్యతోనే బాధపడుతున్నారట. అందుకే ఐదేళ్ల వయసు పిల్లలు కూడా కళ్లద్దాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి. అవి అడ్డంగా ఉంటే పిల్లలు తమకు నచ్చిన క్రికెట్‌తో సహా ఏ ఆటనీ స్వేచ్ఛగా ఆడుకోలేరు, ఎందుకంటే అద్దాలు పడిపోతాయేమోనని భయం. ఇక సర్జరీకి వెళ్లాలన్నా దాన్ని ఇరవై ఏళ్లు దాటితే కానీ చేయరు. మరి అంతవరకూ మయోపియా సమస్య ముదరకుండా అదుపులో ఉంచడానికీ, కళ్లద్దాల అవసరాన్ని తగ్గించడానికీ వచ్చినవే ఈ ఆర్థోకె లెన్స్. వీటిని రాత్రి వేళ పెట్టుకుని పడుకుంటే చాలు. తెల్లవారేసరికి అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. పగటిపూట కళ్లద్దాలు కానీ, లెన్సులు కానీ వాడాల్సిన అవసరమే లేదు. ఇది ఎలా సాధ్యం అవుతుందంటే... ఈ ప్రత్యేకమైన లెన్సులు రాత్రంతా కంటిలోని కార్నియాపైన సున్నితంగా ఒత్తిడి తీసుకొచ్చి కార్నియాని సరైన ఆకృతిలో ఉంచుతాయి. దాంతో తెల్లారి మనకి స్పష్టమైన చూపు వస్తుంది. 'పూర్వపు రోజుల్లో యుద్ధ సమయంలో సైనికులకి చూపు తగ్గితే చాలా ఇబ్బందులు వచ్చేవి. అలాంటప్పుడు బాణం గురితప్పకుండా ఉండేందుకు రాత్రి నిద్రపోయే ముందు తేలికపాటి ఇసుక మూటలని కంటిపైన పెట్టుకుని పడుకునేవారట. తెల్లారితే చూపు మెరుగయ్యేది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటితరానికి తగ్గట్టుగా శాస్త్రవేత్తలు తీర్చిదిద్దినవే ఆర్థో కె లెన్స్. వీటిని పెట్టుకున్న వారం నుంచి రెండు వారాల్లో పూర్తి స్థాయిలో ఫలితాలని ఇస్తాయి. అయితే ప్రతిరోజూ రాత్రి ధరించడం తప్పనిసరి. ఐదేళ్ల నుంచి 60 ఏళ్ల వరకూ ఎవరైనా వీటిని వాడొచ్చు. ఆ తర్వాత కూడా ఇతర కంటి సమస్యల్లేకుండా ఉంటే వీటిని సిఫారసు చేస్తాం. చిన్న పిల్లల్లో మయోపియా పెరగకుండా చేయడానికి ఇవి బాగా ఉపయోగపడతాయి. స్విమ్మింగ్, ఫుట్‌బాల్, మార్షల్ ఆర్ట్స్, రన్నింగ్ వంటి వాటిల్లో రాణించాలనుకునే పిల్లలకు ఇవి ఎక్కువగా లాభిస్తాయి' అంటున్నారు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్న మయోపియా స్పెషలిస్ట్ డాక్టర్ పవన్ వెరికిచర్ల. 'వైద్యులు చెప్పినట్టుగా జాగ్రత్తగా దాచుకుంటే ఏడాదీ ఆపైన మరికొన్ని నెలల వరకూ మన్నుతాయి. ఆ తర్వాత మార్చుకోవాల్సి ఉంటుంది, అలా ఎన్నాళ్లైనా వీటిని కొనసాగించవచ్చు' అంటున్నారు కాంటాక్ట్‌లెన్స్ స్పెషలిస్ట్ కిరణ్మయి చప్పిడి. ఒకప్పుడు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఈ లెన్సులని, ప్రస్తుతం ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ వాళ్లే స్వయంగా తయారు చేస్తున్నారు. చైనా, సింగపూర్‌వంటి దేశాల్లో అధికంగా వాడే ఈ లెన్సులకి ఈ మధ్యనే మన దగ్గరా ఆదరణ పెరుగుతోందట.





# కొత్త రుచుల చాక్లెట్లోచ్!







**నోరూరించే చాక్లెట్‌ని చూస్తే... చిన్నా, పెద్దా ఎవరి మనసైనా అదుపు తప్పుతుంది. అలాంటి చాక్లెట్‌తో జిగేల్‌మనే రంగులు కూడా జతకడితే ఎలా ఉంటుందో ఊహించండి. ఇక, ఆ చాక్లెట్ అందమైన మైనపు కళాకృతిలా కనిపిస్తే తినాలో, దాచుకోవాలో తెలియక తికమక పడాల్సిందే! అలాంటి నయారకం చాక్లెట్లే ఇవన్నీ...**



**ధగధగా మెరిసే హోలోగ్రామ్‌తో**

చాక్లెట్‌పైన ఉండే రేపర్ మెరవడంలో కొత్తేం లేదు, అదే... చాక్లెట్టే ధగధగా మెరిసిపోతే ఎలా ఉంటుంది? ఇంద్ర ధనుస్సు రంగుల్లో మెరిసిపోవడమే... ఇరిడిసెంట్ చాక్లెట్ లేదా హోలోగ్రామ్ చాక్లెట్ల ప్రత్యేకత. మెరుపుల చాక్లెట్లు అంటున్నారు... వీటిని తినొచ్చా అనే అనుమానం రావొచ్చు. ఈ చాక్లెట్లని ఏ భయమూ లేకుండా హాయిగా తినొచ్చు. ఎందుకంటే వీటిని స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు ఎటువంటి కృత్రిమ రంగులూ, నిల్వ కారకాలూ వాడకుండా ప్రత్యేకమైన సాంకేతికతని వాడి తయారుచేశారు కాబట్టి. ఇది ఎలా సాధ్యం అయిందంటే... కాంతి పరావర్తనం చెందినప్పుడు ఏడు రంగులుగా విడిపోయి ఇంద్రధనుస్సు వర్ణాల్లోకి మారుతుందని తెలుసుకదా. ఇక్కడా ఆ సూత్రాన్నే వాడారు. ప్రత్యేకమైన ఫుడ్‌గ్రేడ్ ఫాయిల్స్‌ని తీసుకుని దానిపైకి కాంతిని పంపించి, ఆపైన కరిగించిన వేడి చాక్లెట్‌ని పోస్తారు. అది చల్లారి చాక్లెట్‌గా మారాక ఆపైన ఉండే ఫాయిల్‌ని తొలగిస్తారు. అలా హోలోగ్రామ్ తరహాలో జిగేల్‌మంటూ కాంతిని వెదజల్లే చాక్లెట్లు తయారవుతాయి. కొందరు ఇంట్లోనే వివిధ రుచుల్లో చాక్లెట్లని తయారు చేస్తుంటారు కదా... అలాంటివారి కోసం హోలోగ్రామ్ చాక్లెట్ మౌల్డ్స్ కూడా బజారులో దొరుకుతున్నాయి. వాటితో ఇంట్లో కూడా ఈ మెరుపుల చాక్లెట్లని ప్రయత్నించవచ్చు.

**మధ్యలో పీచుమిఠాయి**

చాక్లెట్ రుచే అద్భుతం... ఇక దానికి పిస్తా పలుకులూ, బాదం, వాల్‌నట్స్ వంటి డ్రైఫ్రూట్స్ కూడా కలిస్తే ఆ రుచి వేరే లెవల్‌లో ఉంటుందని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదేమో! పిస్తా పలుకులతో చేసే కునాఫా చాక్లెట్ ఆ కోవకే చెందుతుంది. ఈ పరంపరని కొనసాగిస్తూ వచ్చిన మరో కొత్త రుచే ఏంజెల్ హెయిర్ చాక్లెట్. ఏంజెల్ హెయిర్ అంటే మనం తినే సోన్‌పాపిడి, పీచుమిఠాయి తరహాలో ఉండే ఒకరకం టర్కిష్ స్వీట్. ఇది వేర్వేరు రుచులూ, రంగుల్లో దొరుకుతుంది. ఇప్పుడిది చాక్లెట్ మధ్యలోకి చేరి కొత్తగా అలరిస్తోంది. చాక్లెట్‌ని మధ్యలోకి తుంచినప్పుడు వివిధ రంగుల్లో బయటపడే ఈ ఏంజెల్ హెయిర్ పిస్తా క్రీమ్, ఆల్మండ్ బటర్‌తో కలిసి సర్‌ప్రైజ్ రుచులను అందిస్తోంది. నోట్లో పెట్టుకోగానే క్షణాలమీద కరిగిపోయే వీటిని కుర్రకారు తమ ఫేవరెట్

* **చాక్లెట్ల జాబితాలోకి చేర్చుకుంటోందంటే ఆశ్చర్యం ఏముంది!**




**క్యాండిల్ కాదు... క్యాండీ**

మైనపు కొవ్వొత్తులూ, బొమ్మల గురించి తెలిసిందే. మరి మైనపు చాక్లెట్ల గురించి ఎప్పుడైనా విన్నారా? ఇవి చూడ్డానికి మైనంతో చేసిన బొమ్మల్లానే ఉంటాయి కానీ... నోట్లో పెట్టుకుంటే గమ్మత్తయిన రుచీ, పరిమళంతో మళ్లీమళ్లీ తినాలనిపిస్తాయి. వీటినే వ్యాక్స్ క్యాండీస్ అంటున్నారు. మైనం ఏంటీ, చాక్లెట్ ఏంటీ అసలు ఏమీ అర్థం కావడం లేదూ అంటారా... మరేం లేదు, వీటిని నాణ్యమైన ఫుడ్‌గ్రేడ్ బీస్ వ్యాక్స్‌ని వాడి తయారుచేస్తున్నారు. తేనెలో ఉండే తీపి వల్ల ఈ చాక్లెట్లు భిన్నమైన రుచితో ఉంటాయి. అదొక్కటే వీటి ప్రత్యేకత కాదు... మైనంతో అందమైన బొమ్మలని చేసే కళ ఎలానూ వాడుకలో ఉంది కదా, ఆ కళా నైపుణ్యాన్ని ఈ వ్యాక్స్ చాక్లెట్ల రూపకల్పనలోనూ ఉపయోగిస్తున్నారు తయారీదారులు. అందుకే అందమైన సీతాకోకచిలుకలూ, చూడముచ్చటైన కోటలూ, బుజ్జిబుజ్జి టెడ్డీబేర్‌లూ, మినీయేచర్ షేపులో ఒదిగిపోయిన డైనోసార్లూ... ఒకటేంటి, వందల ఆకృతుల్లో ఈ వ్యాక్స్ క్యాండీస్ సందడి చేస్తున్నాయి. మైనం అంటున్నారు తినడానికి ఎలా ఉంటుందో అనుకోవచ్చు... క్యాండీ బయట భాగం నమలడానికి బాగుంటే, లోపల వివిధ పండ్ల ఫ్లేవర్లతో చేసిన ఫిల్లింగ్స్ నోరూరిస్తుంటాయి.

